సంపుటి - 4 **జనవరి-2021** సంచిక-1

# జీవస్వరం

ఆధ్యాత్మిక మాస పత్రిక


తండ్రి గారి సందేశం........................................3

సీరోమలబార్ శ్రీసభ దివ్యపూజాబలి ...........................6

సిరోమలబార్ దివ్యపూజాబలి: సంజ్ఞలు సంకేతాలు .........10

బైబిల్ దర్శనం ..............................................11

పునీత హిప్పోనగర పునీత అగస్టీను .............................13

శుభవచనం బైబిల్ క్విజ్......................................15

ఇంద్రధనుస్సు...............................................17

ఏంజెల్స్ కార్నర్..............................................18


బైబిల్ దృశ్యమాలిక..........................................21


శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు..........................23












**ముద్రణానుమతి**

**బిషప్ ప్రిన్స్ అంతోని గారు**

**ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు**

**సంపాదక వర్గం**

ఫాదర్ సిజో

ఫాదర్ యోహాన్

ఫాదర్ మహేశ్

సిస్టర్ క్రిస్టీన CMC

సిస్టర్ హృదయ ASMI

Mr. J. లూర్థు స్వామి

Mr. M. సత్యం

Mrs. K. శ్రీలత

**టైపింగ్ సహకారం** – D. ప్రిన్సి



**జీవస్వరం**
**బిషప్స్ హౌస్**
మంచిర్యాల- 504 208
మంచిర్యాల జిల్లా
తెలంగాణ

**Cell: 09398764408**

**Email ID - jeevaswaramadilabad@gmail.com**

**Jeevaswaram**
**Bishop's House**
Mancherial - 504 208
Mancherial Dist
Telangana State

**“ప్రభువు నాకు భాగధేయము**

**కనుక నేను అతనిని నమ్మెదను.**

**తన్ను నమ్మువారికి, తన్ను వెదుకు వారికి**

**ప్రభువు మేలు చేయును.**

**కావున మనము ప్రభువు రక్షణము**

**కొరకు ఓపికతో వేచియుండుట మేలు”.**

**(విలాపగీతాలు 3, 24-26)**

ప్రియ సహోదరీ సహోదరులారా,

చాలా నెలల తరువాత జీవస్వరం మాసపత్రిక ప్రచురింపబడుతుంది.

ఆగస్టు నెలలో ప్రచురింపబడిన మాసపత్రిక ప్రతి కోవిడ్ 19 వ్యాధి

విస్తరిస్తున్న సందర్భముగా అన్ని చోట్లకు చేరలేదు.

కాబట్టి, ఆగస్టు నెలలో ప్రచురించిన శుభవచనం బైబిల్ క్విజ్,

ఇంద్రధనుస్సు పోటీలు మరియు ఇతర విషయాలను మళ్ళీ ప్రచురిస్తున్నాము.

గత సంవత్సరపు వార్షిక శుభవచనం బైబిల్ క్విజ్‌ను రద్దు చేస్తున్నాము.

దయచేసి గమనించగలరు.

వివరాలకు సంప్రదించండి

**9398764408**



# తండ్రి గారి సందేశం....

## యేసు ప్రభువు నిజమైన దేవుడు

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

మనం దేవుని కుమారుడైన యేసు ప్రభు భూలోకంలో జన్మించాడని విశ్వసిస్తున్నాం. కొద్ది రోజుల క్రితమే ఆయన జన్మదినాన్ని జరుపుకున్నాం. యేసు ప్రభువు మానవునిగా జన్మించాడు కానీ, ఆయన దేవుని కుమారుడని, స్వయంగా దేవుడని మనం విశ్వసిస్తున్నాం. కానీ, చాలా మంది యేసు ప్రభువు దేవుడు కాడని ఆయన కేవలం మానవ మాత్రుడని చెబుతుంటారు. యేసు ప్రభు మంచి మనిషి, బోధకుడని, కేవలం ప్రవక్త అని, సంఘ సంస్కర్త అని చెప్పేవారు కూడా ఉన్నారు. యేసు దేవుడని అంగీకరించటం ఇష్టపడని వారు కూడా ఉన్నారు. అందుకు వారు చెప్పే కారణం–"యేసు తను దేవుడనని ఎక్కడా చెప్పుకోలేదు" అని అంటారు. కానీ పరిశుద్ధ గ్రంథాన్ని లోతుగా పరిశీలిస్తే అది నిజం కాదు అని మనకు అర్థమవుతుంది.

యేసు యూదుడుగా జన్మించాడు. ఆయన ప్రజ్ఞా సామర్థ్యము, పాండిత్యము, జీవితము, కార్యకలాపాలు అనన్య సామన్యము. నీకొదేము కూడా ఆయనను "బోధకుడా (రబ్బీ), నీవు దేవుని యొద్ద నుండి వచ్చిన బోధకుడవని మేము ఎరుగుదుము. ఏలయన, దేవుని సహకారము లేని యెడల నీవు చేయుచున్న అద్భుతకార్యములు ఎవడును చేయలేడు" అని పలికెను (యోహాను 3,2). ప్రభువైన యేసుకు తోరా (ఆదికాండము నుండి ద్వితీయోపదేశ కాండము) తెలుసు. పరిశద్ధ లేఖనాలను ఆయన బాగుగా ఎరుగును. యేసు తన దైవత్వానికి రుజువుగా లేఖనాలను ఉపయోగించినప్పుడు, ఆయన సందేశాన్ని ఆనాటి ప్రజలు అంగీకరించలేకపోయారు. వారు నివ్వెర పోయారు, కోపంతో మండిపడ్డారు. తాను దేవుడనని ఆయన చెప్పుకున్నట్టు వారికర్థమైంది.

మోషేకు బయలుపరచబడిన దేవుని నామాన్ని యూదులు ఎంత భక్తి గౌరవాలతో జాగ్రత్తపరచారంటే, కనీసం వారు దానిని ఉచ్చరించడానికి కూడా భయపడేవారు. యావే అని ఉచ్చరింప శక్యము కాని నామానికి బదులు "ప్రభువు" (అదోనాయ్) అని వారు పలికేవారు. దేవుడు మోషేకు బయలుపరచిన నామము యెహోవా, "ఉన్నవాడు" (ఆంగ్లంలో I AM) అనే క్రియావాచకం యొక్క రూపమది. మరో విధంగా చెప్పాలంటే, మోషేకు దేవుడు తన్ను బయలు పరచుకున్నది "నేనే" (I AM) అని.

ఈ నామాన్ని యేసు ప్రభువు తనకు వర్తింపజేసికొన్నప్పుడు యూదులకు వచ్చిన కోపాన్ని రౌద్రాన్ని మనం అర్థం చేసికొనడం కష్టమౌతుంది. "అబ్రహాము జన్మించుటకు పూర్వమే **నేను** (I AM) ఉన్నాను అని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను". అని యేసు పలికెను. అందువలన వారు ఆయనపై రాళ్లు రువ్వ పూనుకొనిరి (యోహాను 8,58-59). ఇదే అత్యున్నతమైన నిరూపణ. యూదులు మాత్రం ఆయనను నమ్మలేదు. ఆయన చెప్పుకొన్నది దేవదూషణగా వారు భావించారు. దేవదూషణ రాళ్లతో కొట్టి చంపబడే దోషమైనందున (లేవీ 24,16) రోమా చట్టం క్రింద అనుమతిలేని అల్లరి మూక యొక్క కార్యంగా చేయ వారు ప్రయత్నించారు (యోహాను 18,31).

**"నేనే"** అనే సూత్రాన్ని ఈ విధంగా మాట్లాడడం దైవత్వానికి తగియున్నట్టు కన్పిస్తుంది. "ఇది యేసు తన్ను గూర్చి తాను బహు ధైర్యంగా చేసిన ప్రతిపాదన– **'నేనే'.** నేనెక్కడ ఉందునో అక్కడ దేవుడున్నాడు, అక్కడ దేవుడు నివసిస్తాడు, పిలుస్తాడు, మాట్లాడతాడు, క్రియ జరిగిస్తాడు, నిర్ణయిస్తాడు, ప్రేమిస్తాడు అని దాని భావం.

"నేనే" అనే ప్రతిపాదన ప్రాథమికంగా దైవత్వాన్ని సూచిస్తుంది. (ఉదా॥ యెషయా 41,4). ఇది మనస్సులో ఉంచుకుంటే, ప్రభువైన యేసు జీవితంలోని అనేక ప్రతిపాదనలు ప్రత్యేకమైన ప్రాధాన్యత కలిగినవై ఉంటాయి. కొన్ని ఉదాహరణలను గమనించండి. "జీవాహారమును **నేనే**", **"నేను** లోకమునకు వెలుగై యున్నాను," "గొర్రెలు పోవు ద్వారమును **నేనే,"** **"నేను** గొర్రెల మంచి కాపరిని," "పునరుత్థానమును **నేనే,"** **"నేనే** మార్గమును సత్యమును జీవమును," **నేనే** నిజమైన ద్రాక్షావల్లిని" (యోహాను 6,35; 8,12; 10,7-11; 11,25; 14,6; 15,1).

యేసు ప్రభు తనను దేవుని కుమారుడునని చెప్పుకున్నాడని యూదులు భావించినందు చేతనే వారు ఆయనను ద్వేషించారు. ఆయనను చంపటానికి ప్రయత్నించారు. "ఇది వినిన యూదులు ఆయనను చంపుటకు ఇంకను ఎక్కువగా ప్రయత్నించిరి. ఏలయన, ఆయన విశ్రాంతి దిన నియమమును మీరుటయే కాక, దేవుడు తన తండ్రి అని చెప్పుచు తన్ను దేవునికి సమానముగ చేసికొనుచుండెనని వారు భావించిరి" (యోహాను 5,18). యేసు "అబ్రహాము జన్మించుటకు పూర్వమే నేను ఉన్నాను అని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అని పలికెను. అందువలన వారు ఆయనపై రాళ్లురువ్వ పూనుకొనిరి. (యోహాను 8,58-59).

ఈ మాటలు రెండు విషయాలను మనకు తెలియజేస్తున్నాయి.

1. యేసు ప్రభువు అనాది కాలం నుండి ఉన్నవాడు.
2. యావే తన నామాన్ని బయలు పరచడానికి ఉపయోగించిన "నేనే" (ఆంగ్లములో I AM) అనే పదాన్ని యేసు ప్రభు తన కొరకు కూడా ఉపయోగించాడు.

ఒక సారి ఈ మాటలను గమనించండి

"ఈ కార్యమును నిర్వహించిన దెవడు? ఆది నుండి తరతరాల ప్రజలను సృజించిన దెవడు? ప్రభువునైన నేనే. ప్రథమమున ఉన్న వాడను నేనే. కడపటన ఉండు వాడను నేనే" (యెషయా 41,4). ఇస్రాయేలు రాజును వారి విమోచకుడును సర్వశక్తిమంతుడైన ప్రభువు ఇట్లనుచున్నాడు. "మొదటి వాడను కడపటి వాడను నేనే. నేను తప్ప వేరొక దేవుడు లేడు" (యెషయా 44,6). "యాకోబు! నేను పిలిచిన యిస్రాయేలూ! నా పలుకు లాలింపుము. నేను ప్రభువును, మొదటి వాడను, కడపటి వాడను గూడ (యెషయా 48,12).

యావే దేవుడు తనను గురించి "నేనే మొదటి వాడను, కడపటి వాడను" అని అన్నాడు. యేసు ప్రభు కూడా ఇవే మాటలను తన గురించి పలుకుతున్నాడు. "నేను ఆయనను చూచిన తోడనే మృతిని వలె ఆయన పాదముల ముందట పడితిని. ఆయన తన కుడి చేతిని నాపై ఉంచి యిట్లనెను. "భయపడకుము. ఆది, అంతము నేనే" (దర్శన 1,17). "నేనే ఆల్ఫా, ఓమేగ, నేనే మొదటి వాడను, కడపటి వాడను, నేనే ఆదియును అంతమునై ఉన్నాను అని పలికెను" (దర్శన 22,13).

పునీత పౌలు గారు యేసు ప్రభు దైవత్వాన్ని గురించి వివరిస్తున్నారు. "క్రీస్తు యేసు నందు మీదైన ఈ మనస్తత్వమును మీ మధ్య ఉండనిండు. ఆయన ఎల్లప్పుడును దైవ స్వభావమును కలిగి ఉన్నను, దేవునితో తన సమానత్వమును గణింపలేదు. ఇది గ్రహింపవలసిన విషయము. కాని ఆయన తన్నుతాను రిక్తుని చేసికొని సేవక రూపమును దాల్చి మానవ మాత్రుడుగా జన్మించెను" (ఫిలిప్పీ 2,5-7)

యేసు దైవత్వాన్ని వివరించే మరి కొన్ని ఉదాహరణలు చూద్దాం.

"తండ్రి ఎవనికిని తీర్పు విధింపడు. తీర్పు విధించు సర్వాధికారము కుమారునకు ఇచ్చెను. అందరు తండ్రిని గౌరవించినట్లే కుమారుని కూడ గౌరవించుటకు ఆయన అట్లు చేసెను. కుమారుని గౌరవింపనివాడు ఆయనను పంపిన తండ్రిని కూడ గౌరవింపడు" (యోహాను 5,22-23). "ఏలయన, తండ్రి తనంతట తాను జీవము కలిగియున్నట్లే కుమారుడు కూడ తనంతట తాను జీవము కలిగియుండునట్లు చేసెను" (యోహాను 5,26).

"వానిని నా కిచ్చిన నా తండ్రి అందరి కంటె గొప్పవాడు. కనుక, వానిని నా తండ్రి చేతి నుండి ఎవడును అపహరింపలేడు. ''నేనును, నా తండ్రియు ఏకమైయున్నాము'' అని చెప్పెను (యొహాను 10,29-30). "కాని నేను వానిని నెరవేర్చుచున్న యెడల, మీరు నన్ను నమ్మకపోయినను, నా పనులనైనను నమ్ముడు. తండ్రి నా యందును, నేను తండ్రి యందును ఉన్నామని మీరు గ్రహింతురు" (యెహాను 10,38). ''యేసు వారితో ''మీ హృదయమును కలవర పడనీయకుడు. దేవుని విశ్వసింపుడు. నన్నును విశ్వసింపుడు'' (యెహాను 14,1). "మీరు నన్ను ఎరిగియున్నచో, నా తండ్రిని కూడా ఎరిగి యుందురు. ఇక నుండి మీరు ఆయనను ఎరుగుదురు. మీరు ఆయనను చూచి ఉన్నారు అని పలికెను" (యెహాను 14,7). "తండ్రి కుమారుని యందు మహిమ పరుప బడుటకు మీరు నా పేరిట ఏమి అడిగినను చేసెదను. మీరు నా పేరిట నన్ను ఏమి అడిగినను దానిని చేసెదను" (యొహాను 14,13-14). ''నిన్నను, నేడును, ఎల్లప్పుడును, యేసు క్రీస్తు ఒకే రీతిగ ఉండును" (హెబ్రీ 13,8).


ఈ విధంగా క్రొత్త నిబంధన యేసు ప్రభు దైవత్వాన్ని రుజువు చేస్తుంది. ప్రియ సహోదరీ, సహోదరులారా! మనం యేసు ప్రభువును దేవునిగా అంగీకరించి ఆయనను ఆరాదిద్దాం, ఆయన బాటలో నడుద్దాం. ఆయనే మన రక్షకుడు, మనలను నిత్యజీవానికి చేర్చేవాడు. యేసు ప్రభునందు విశ్వాసముంచి ముందుకు సాగుదాం.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు

## ధ్యాన కేంద్ర నిర్మాణము కొరకు ప్రార్థన

ప్రభువా, నీ నామ మహిమ కొరకు
మరియు
ఆదిలాబాద్ గురుపీఠంలో
సువార్త వ్యాప్తి కొరకు మేము
నిర్మిస్తున్న ధ్యానకేంద్రాన్ని
ఆశీర్వదించండి. ఎటువంటి
ఆటంకములు లేకుండా దానిని
సకాలంలో పూర్తి చేయుటకు
తద్వారా మీ సువార్తను
ప్రకటించుటకు మాకు అనుగ్రహం
దయచేయమని ప్రార్థించుచున్నాము.
ఆమెన్.



## సీరోమలబార్ శ్రీసభ దివ్యపూజాబలి

ప్రియ సహోదరీ సహోదరులారా, మన దివ్యపూజాబలి గురించి, దివ్యబలిలోని ప్రార్థనలు వాటి అర్థము, పవిత్ర వస్తువులు, దేవాలయంలోని నిర్ణీత స్థలాలు వాటి అర్థము లాంటి విషయాలు తెలుసుకోవాలని అడిగిన వారు అనేక మంది ఉన్నారు. దివ్యబలి యొక్క సరైన అర్థం తెలుసుకుంటే దివ్యబలిలో అర్థవంతంగా పాల్గొంటాం. అందుకే, దివ్యబలి గురించి కొన్ని విషయాలను ప్రశ్న జవాబుల రూపంలో మరియు వ్యాస రూపంలో ఇస్తున్నాము. ఇందులో కొన్ని అర్థం అవటానికి ఇబ్బంది ఉంటుంది అని తెలుసు. ఇప్పటి పరిస్థితి కొలిక్కి వచ్చిన తరువాత దివ్యపూజాలి గురించి క్లాసులు విచారణ స్థాయిలో నిర్వహించడం జరుగుతుంది. వీటిపై పరీక్ష కూడ ఉంటుంది. ఆ వివరాలు తరువాత తెలియజేయబడుతాయి. కాబట్టి, అందరు దివ్యబలి గురించి ఉన్న ఈ వివరాలను శ్రద్ధగా నేర్చుకోమని కోరుతున్నాను.

బిషప్ ప్రిన్స్ అంతోని
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రానులు

## సీరోమలబార్ శ్రీసభ దివ్యపూజాబలి

1. మన దివ్యపూజాబలిలో మహోన్నత స్థలములో దేవునికి మహిమ అనే గీతము దేనిని సూచిస్తుంది?

జ. యేసుప్రభు జన్మను సూచిస్తుంది

2. మన దివ్యపూజాబలిలోని సాధారణ ప్రార్థనలకు సిరియక్ భాషలో ఉపయోగించే పేరు?

జ. స్లోసా

3. మన దివ్యపూజాబలిలోని పాటలకు సిరియక్ భాషలో ఉపయోగించే పేరు?

జ. ఓనీసా

4. మన దివ్యపూజాబలిలోని విన్నప ప్రార్థనలకు సిరియక్ భాషలో ఉపయోగించే పేరు?

జ. కారోసోసా

5. "ప్రభువా మహా రారాజా" అనే గీతము లేదా కీర్తనమాల దేనిని సూచిస్తుంది?

జ. యేసుప్రభు రహస్య జీవితాన్ని

6. సీరోమలబార్ శ్రీసభ దైవార్చనపరంగా ఏ కుటుంబానికి చెందినది?

జ. తూర్పు సిరియక్ కుటుంబానికి (East Syrian Rite)

7. సీరోమలబార్ దివ్యపూజాబలి మూల భాష ఏది?

జ. సిరియక్ భాష

8. సిరియక్ యొక్క ప్రాముఖ్యత ఏమి?

జ. సిరియక్ అనేది యేసుప్రభు మాట్లాడిన భాష లేదా యేసుప్రభు మాట్లాడిన అరమాయ భాష సిరియక్ భాష యాసము

9. మన శ్రీసభకి సీరోమలబార్ అనే పేరు ఏలా దక్కింది?

జ. ఇది మలబార్ తీరంలో సిరియక్ సాంప్రదాయం పాటిస్తున్న శ్రీసభ కాబట్టి ఆ పేరు దక్కింది.

10. సీరోమలబార్ శ్రీసభ యొక్క సోదరీ శ్రీసభ లేదా సీరోమలబార్ దివ్యపూజాబలిని ఆచరిస్తున్న ఇతర క్రైస్తవులు ఎక్కడ కనబడుతున్నారు?

జ. పర్షియా సామ్రాజ్యంలో అనగా ఇప్పటి ఇరాక్ దేశంలో

11. దేవాలయంలో పరలోకానికి ప్రతీకయైన స్థలము ఏది?
జ. అతిపరిశుద్ధ స్థలము లేదా మద్‌బహ లేదా (Sanctuary)
12. దేవాలయంలో భూమికి సంకేతమైన స్థలము ఏది?
జ. హైకల
13. దేవాలయంలో యేసుప్రభు జీవించిన, సువార్తను ప్రకటించిన యెరూషలేం నగరానికి ప్రతీకయైన స్థలము ఏది?
జ. బేమ లేదా వాక్యపరిచర్య వేదిక.
14. దేవాలయంలో పారదేశానికి ప్రతీక?
జ. కెస్ర్తోమ
15. దేవాలయంలో గాయక వేదిక ఏది?
జ. కెస్ర్తోమ
16. దివ్యపూజాబలిలో పాతనిబంధన పఠనాల కోసం కేవలం పాతనిబంధన గ్రంథంలో మాత్రం ఉన్నటువంటి పవిత్ర గ్రంథానికి పేరు?
జ. కెర్యాన
17. దివ్యపూజాబలిలో లేఖనాల పఠనం కోసం కేవలం లేఖలు మాత్రము ఉన్న గ్రంథానికి పేరు?
జ. ఎంకర్తా
18. దివ్యపూజాబలిలో సువార్త పఠనం కోసం నాలుగు సువార్తలు మాత్రం ఉన్న పఠనానికి పేరు?
జ. ఎవాంగెలియోన్
19. దివ్యపూజాబలి అనంతరం బలిపీఠము మీద పెట్టబడే రెండు వస్తువులు ఏవి? లేదా బలిపీఠానికి అలంకారములు ఏమి?
జ. మర్ తోమా సిలువ, ఎవంగెలియోన్
20. బేస్‌కస అనగా ఏమి?
జ. పవిత్ర అప్పద్రాక్షరసములు (దివ్యపూజాబలిలో అప్పద్రాక్షరసముల సజ్జీకరణ కోసం ఉపయోగించే పీఠములు)
21. బెస్‌సహదా అనగా ఏమి?
జ. హతసాక్ష్యుల పవిత్ర అవశేషములు పెట్టే పేటిక.
22. దేవాలయంలో ప్రజలు నిలబడే స్థలం?
జ. హైకల
23. వాక్యపరిచర్య వేదికలో పెట్టబడే బల్లకి పేరు?
జ. బేమ
24. వాక్యపరిచర్య బల్ల (బేమ) మీద పెట్టె రెండు క్రొవ్వొత్తులు దేనిని సూచిస్తున్నాయి?
జ. కొత్త నిబంధనకు పాతనిబంధనకు ప్రతీకలు
25. మార్ తోమా సిలువ దేనికి ప్రతీక?
జ. యేసుప్రభు పునరుత్థానానికి ప్రతీక
26. కొత్తీన అనగా ఏమి?
జ. కొత్తీన అనేది దివ్యపూజాబలి కోసం యాజకుడు ధరించే వస్త్రములలో మొదటిది, ఇది పొడవైన ఒక అంగి.

27. కొత్తీన దేనిని సూచిస్తుంది?
జ. పాత మానవుని ఒలిచివేసి క్రొత్త మానవుని ధరించడమునకు ప్రతీక
28. సూనార అనగా ఏమి?
జ. సూనార అనేది నడుము పట్టి
29. సూనార దేనిని సూచిస్తుంది?
జ. బ్రహ్మచర్య పవిత్రతను, సేవామనస్థత్వాన్ని సూచిస్తుంది
30. ఊరార దేనిని సూచిస్తుంది?
జ. యాజక అధికారాన్ని సూచిస్తుంది
31. కాపా దేనిని సూచిస్తుంది?
జ. కాపా అనేది వస్త్రము. యాజకుడు సర్వగుణ సంపన్నుడు అని సూచిస్తుంది
32. ఊరారను ఎడమభుజం మీద ధరించేవారు ఎవరు?
జ. డీకనులు
33. డీకనుల బాధ్యత ఏమి?
జ. వారు దివ్యపూజాబలిలో పరిచారకులు మరియు దివ్యపూజాబలిలో అధికారపూర్వకముగా లేఖలు చదివేవారు.
34. ఊరారని మెడకి చుట్టుగా ధరించేవారు ఎవరు?
జ. హెపుదియాకోన పట్టము కలిగిన వారు
35. హెపుదియాకోన బాధ్యత ఏమి?
జ. వారు దేవాలయాన్ని పరిశుభ్రంగా ఉంచేవారు. వారు గాయక బృందం
36. కుత్తీన, సూనార మరియు ఊరారను చేతుల మీదగా ధరించే వారు ఎవరు?
జ. కారోయ
37. కారోయ పరిచర్య ఏమి?
జ. దివ్యపూజాబలిలో అధికారపూర్వకంగా పాతనిబంధన పఠనములు చదివేవారు
38. పాతనిబంధన పఠనాల తరువాత ప్రజల జవాబు ఏమి?
జ. మన దేవుడైన ప్రభువునకు స్తుతి స్తోత్రములు
39. క్రొత్తనిబంధన పఠనాల తరువాత ప్రజల జవాబు ఏమి?
జ. మన ప్రభువైన యేసుక్రీస్తునకు స్తుతి స్తోత్రములు
40. దివ్యపూజాబలిలో పాతనిబంధన పఠనాలు చదివే అధికారము ఎవరికి ఉంది?
జ. కారోయా పట్టము గలవారికి
41. దివ్యపూజాబలిలో లేఖల పఠనము చదివే అధికారము ఎవరికి ఉంది?
జ. డీకను పట్టము గలవారికి
42. డీకెను లేఖల పఠనములు చదువుతుండగా మరొక పరిచారకుడు ఏమి చేయవలెను?
జ. డీకను కుడివైపున ఒక క్రొవ్వొత్తి పట్టుకొని నిలబడాలి
43. పాతనిబంధన పఠనము ఎక్కడ నిలబడి చదవాలి?
జ. బలిపీఠమునకు కుడివైపున నిలబడి లేదా బేమా కుడివైపున నిలబడి చదవాలి.

44. లేఖల పఠనము ఏ వైపు నిలబడి చదవాలి?
జ. బేమా ఎడమవైపున నిలబడి
45. పరిచారకుడు వేడుదల ప్రార్థన చేపూఉండగా గురువు ఏంచేస్తాడు.
జ. గురువు అప్పద్రాక్షరసములను సిద్ధం చేస్తారు
46. ప్రభువును నేను దృధముగా ఆశ్రయించితిని అనే పాట సమయంలో గురువు ఇరువైపుల నుండి యేసుప్రభు అప్పద్రాక్షరసములను తీసుకొనిరావడం దేనిని సూచిస్తుంది?
జ. యేసుప్రభు శ్రమల ప్రయాణాన్ని సూచిస్తుంది
47. బలిపీఠము దగ్గర గురువు అప్పద్రాక్షరసములను సిలువ ఆకారములో ఎత్తిపట్టుకొని ప్రార్థన చేయడం దేనిని సూచిస్తుంది?
జ. యేసుప్రభు సిలువ మరణాన్ని సూచిస్తుంది
48. అప్పద్రాక్షరసము ఉన్న పల్లెమును, పాత్రమును మూడుసార్లు తట్టి బలిపీఠము మీద సగౌరవంగా పెట్టడం దేనిని సూచిస్తుంది?
జ. యేసుప్రభు భూస్థాపనను సూచిస్తుంది
49. విశ్వాస సంగ్రహము చెప్పేటప్పుడు గురువు పరిచారకులు ఎక్కడ నిలబడవలెను?
జ. వారు పవిత్ర స్థలము యొక్క ప్రవేశ ద్వారము దగ్గర నిలబడవలెను
50. దివ్యపూజాబలిలో విశ్వాసుల కోసం విశ్వాసుల పేరెత్తి ప్రార్థన చేయవలసిన ప్రార్థన ఏది?
జ. డిప్టిక్స్ (Dyptichs)
51. దివ్యపూజాబలిలో ఎన్ని ప్రణామజప చక్రములు ఉన్నాయి?
జ. నాలుగు ప్రణామజప చక్రాలు ఉన్నాయి
52. ప్రణామజపానికి సిరియక్ భాషలో ఏం అంటారు?
జ. గెహన్తా
53. ఒక గెహన్తా చక్రంలో ఎన్ని అంశాలు ఉన్నాయి?
జ. నాలుగు
54. ఆ నాలుగు అంశాలు ఏవి?
జ. ప్రార్థన, అభ్యర్థన (కుశాప్ప), ప్రణామజపము, కానోనా
55. కుశాప్ప అంటే అర్థము ఏమి?
జ. నిశ్శబ్ద ప్రార్థన
56. కుశాప్పలో గురువు ఎవరి కోసం ప్రార్థన చేస్తారు?
జ. తన కోసం తాను ప్రార్థన చేస్తాడు
57. కుశాప్ప ప్రార్థనల విషయం ఏమిటి?
జ. యజమాని బలహీనత, పాప పరిస్థితి
58. ప్రణామజపాల సారాంశం ఏమి?
జ. దేవుడు మానవజాతి కోసం చేసిన గొప్ప కార్యములు. స్మరించుట, వాటికి కృతజ్ఞత తెలుపుట.
59. పల్లెమును పాత్రను కప్పె వస్త్రమును ఏమంటారు?
జ. శోశప్ప
60. ప్రతిష్ఠింపబడిన బలిపీఠము లేని సమయాలలో బలిపీఠమునకు బదులుగా ఉపయోగించే వస్తువు ఏది?
జ. దప్పా

# సీరోమలబార్ దివ్యపూజాబలి : సంజ్ఞలు సంకేతాలు

**సంజ్ఞలు సంకేతాల అర్ధము**

మానవ జీవితంలో సంజ్ఞలకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. నేరుగా చూడలేని, వినలేని, ఎరుగలేని నిరవధిక వాస్తవాలతో మానవుడు నిరంతరంగా సంబంధము పుచ్చుకొనే ఉన్నాడు. ఈ సంపర్కమనేది కొందరు మధ్యవర్తుల ద్వార సాధ్యమౌతుంది. ఉదాహరణకి ప్రేమ అనేది ఒక అగోచర వాస్తవము. కాని గోచరమైన, కంటికి కనిపించే సంజ్ఞల ద్వార ప్రేమను వెల్లడి చేయగలము. కౌగలించుకోవడం, సన్మానించుకోవడం మొదలైనవి ప్రేమ యొక్క బహిరంగ సంజ్ఞలే. అలాగే చప్పట్లు కొట్టడం, నాట్యము చేయడం మొదలైనవి ఆనందము యొక్క సంజ్ఞలుగా భావించవచ్చు. రహదారిలో కనిపించే సూచనలు, గుర్తులు కూడ ఇలాంటి సంజ్ఞలే. మన మాటలు, దేహభంగిమలు కూడ అగోచరమైన కొన్ని వాస్తవాల బహిరంగ సంజ్ఞలే. ఈ విధంగా సంజ్ఞలు లేకుండా మానవ జీవితము అసాధ్యము.

**1. పవిత్ర స్థలములు**

**బలివేదిక (మద్‌బహా):** అతి పవిత్ర స్థలము. మద్‌బహా పరలోకానికి ప్రతీక; మద్‌బహా పవిత్రతను గొప్పతనాన్ని వెల్లడించడానికి మద్‌బహాను ఒక తెర వేసి వేరుపరచే సాంప్రదాయం కూడ మన శ్రీసభలో ఉన్నది.

**బలిపీఠము (అల్తార):** బలివేదికకు కేంద్రము బలిపీఠము. పరమ దివ్యరహస్యములు బలిపీఠముపై అనుష్టింపబడుతున్నాయి. బలిపీఠము కొన్ని ప్రధాన వస్తువులకు ప్రతీక–త్రియేక దేవుని సింహాసనం, యేసు ప్రభు సమాధి, బలిపీఠము, పరలోకపు నిచ్చెన, కడరాత్రి భోజనబల్ల మొదలగునవి.

**మందసము:** గంటారాధన మరియు దివ్యపూజాబలి లేనప్పుడు సత్ప్రసాద స్వీకరణ కోసం పవిత్ర దివ్యసత్ప్రసాదమును భద్రపరచే పేటికే మందసము.

**ఉపపీఠములు (బేస్‌గసాలు):** బలిపీఠమునకు ఇరు వైపులా అప్ప ద్రాక్షరసములను తయారుచేయుట కోసం స్థాపించబడిన పీఠములు ఇవి.

**పవిత్రావశేషముల మందసము (బేస్‌సహదే)**

హతసాక్షుల పవిత్రావశేషములు భద్రపరచే మందసమిది. ఇది సాధారణంగా మద్‌బహా కుడివైపున స్థాపించబడుతుంది.

**వచన వేదిక (బేమ) :** హైకల మధ్యలో లేదా కెస్ర్తోమకు దగ్గరగా ఏర్పాటు చేసే వేదికను బేమ అంటారు. దీని మధ్యలో ఒక పీఠమును దాని మీద పవిత్ర సిలువ మరియు క్రొవ్వొత్తులు ఏర్పాటు చేస్తారు. బేమ ఐహిక జెరుసలేమునకు ప్రతీక.

**గాయక వేదిక (కెస్ర్తోమ):** మద్‌బహాకు హైకలకు మధ్యగా హైకల నుండి ఒక్క మెట్టు ఎత్తులో స్థాపించబడుతుంది కెస్ర్తోమ. గాయకబృందము నిలబడే స్థలమిది.

**జ్ఞానస్నాన జలకలశం:** జ్ఞానస్నానము పొందగోరే వారికి జ్ఞానస్నాన విధులు పరిచర్య చేయడానికై సవిశేషంగా సిద్ధపరచే తొట్టి. ఈ జలకలశమున ఆధ్యాత్మికముగా జన్మించి బలిపీఠముచెంత జీవాహారము ఆరగించి పునీతుల గణములో చేరవలసిన వారు క్రైస్తవులు.

**సమూహ వేదిక (హైకల):** విశ్వాసులు నిలిచియుండు దేవాలయ భాగము హైకల. ఇది భూమికి ప్రతీక.

**సాక్రిస్టి:** గురువులు, పరిచారకులు పవిత్ర వస్త్రములు ధరించే, దైవార్చనా విధుల కోసం సిద్ధమయ్యే స్థలము.

**2. పవిత్ర వస్తువులు**

**సిలువ:** రక్షణకు సంజ్ఞ మరియు క్రీస్తు సిలువ బలికి, పునరుత్థానానికి ప్రతీక.

**సువార్తా గ్రంథము:** నాలుగు సువార్తా పుస్తకములు మాత్రము ఉన్న సువార్తా గ్రంథము. ఇది బలిపీఠమునకు కుడివైపున ప్రతిష్ఠింపబడుతుంది.

**అప్పద్రాక్షా రసములు:** అప్ప, ద్రాక్షారసములు యేసు ప్రభు శరీర, రక్తాలకు ప్రతీక.

**పవిత్ర పాత్రములు:** దివ్యపూజాబలిలో ఉపయోగించే పవిత్ర పాత్రములు– ముఖ్యంగా పాత్రము, పళ్ళెము మరియు కుస్తోది (చిన్న అప్పములు పెట్టె పాత్రము). పవిత్ర రక్తము చేకొనుటకు పాత్రమును, పవిత్ర శరీరాన్ని చేకొనుటకు పళ్ళెమును ఉపయోగిస్తాము. చిన్న అప్ప రూపములో ఉన్న క్రీస్తు శరీరాన్ని మందసంలో ఉంచడానికి కుస్తోదిని ఉపయోగిస్తారు.

**నిత్యదీపం:** నిత్యదీపము లోకానికి వెలుగైన క్రీస్తు (యోహాను 8:12) నిరంతర సన్నిధానాన్ని సూచిస్తుంది. మద్‌బహాలో కాని మద్‌బహా ముఖ్య ద్వారము వద్ద ఈ దీపము తగిలింపబడుతుంది.

**3 పవిత్ర వస్త్రములు**

**కొత్తీన:** క్రీస్తునందు నూత్నీకరించబడిన మానవులకు, ప్రతీక కొత్తీన. పాత మానవుని, అనగా మనుష్య ప్రకృతిని ఒలిచి వేసి కొత్త మానవుని ధరించి బలియర్పణ గావించవలయునని కొత్తీన మనలను ఆదేశిస్తుంది.

**సూనారా (నడుముపట్టి):** బ్రహ్మచర్య పవిత్రతకు, సేవామనస్తత్వమునకు ప్రతీక. కొత్తీనా మీదుగా నడుమునకు కట్టే ఈ పట్టి ఐహిక చింతలు, వాంఛల నుండి దూరమై జాగరూగతతోను పవిత్రతతోను ప్రభువునకు సేవలర్పించవలయునని బోధిస్తుంది.

**ఊరారా:** దైవ సేవకై నియమింపబడుటను సూచిస్తూ మెడమీద వేసుకోబడుతుంది ఊరారా. ఇది యాజక అధికారమును, పవిత్రతను సూచిస్తుంది.

**సందే (చెయ్యిజోళ్ళు):** కొత్తీన యొక్క అంచులు క్రమంగా సదిరి ఉండటానికి వాడే వస్త్రములు సందే.

**పైనా (కాప్పా):** అర్చకుడు పవిత్ర వస్త్రములన్నిటి మీదుగా ధరించే పొడువైన అంగి. యాజకుడు న్యాయమును ధరింపవలయునని సూచిస్తూ వేసుకొనే కాప్పా, కాపరికి చెందిన ధర్మమును కూడ సూచిస్తుంది.

**శోశప్పు:** కాప్పా నిర్మాణం కోసం ఉపయోగించే అదే బట్టతో తయారు చేసే చతురస్ర ఆకారములో ఉన్న పవిత్ర వస్త్రము శోశప్పు. పరమ రహస్యములను, అనగా పాత్రములో పళ్ళెములో ఉన్న పవిత్ర రక్త, శరీరాలను శోశప్పుతో కప్పి వేసినప్పుడు యేసు ప్రభుని సమాధి చేయడమును, తరువాత శోశప్పును పరమ రహస్యముల చుట్టుగా సదురుకోవడం యేసు ప్రభు పునరుత్థానమును సూచిస్తున్నాయి. శోశప్పును మూడు వస్తువులకు ప్రతీకగా భావిస్తున్నాము. యేసు ప్రభు సమాధిని మూసిన రాయి, ఆయన పవిత్ర శరీరాన్ని కప్పి ఉంచిన గుడ్డ మరియు యేసు ప్రభు శిరోవస్త్రము.

**4 పవిత్ర వ్యక్తులు**

**సమూహము:** దివ్యపూజాబలిలో పాల్గొనే విశ్వ శ్రీసభకు ప్రతీక సమూహము.

**అర్చకుడు:** పూజాబలి అర్పించే గురువు క్రీస్తు ప్రత్యక్ష రూపధారి, మరియు దేవునికి మానవులకు మధ్య నిలిచే మధ్యవర్తి. ఆయన సంఘము కొరకై బలియర్పణ చేస్తున్నారు.

**పరిచారకులు:** డీకనులు మరియు ఇతర పరిచారకులు దేవదూతల హోదాలో ఉంటున్నారు. దివ్యపూజాబలిలో ఉజ్జీవముతోను, భక్తి శ్రద్ధలతోను పాల్గొనుటకు విశ్వాసులకు తోడ్పడుతూ సమయోచితమైన సూచనలు ఇస్తుంటారు. ఇంకా దివ్యపూజాబలి ఆచరణలలో వారు అర్చకునికి సహాయకులుగా నిలుస్తారు.

**5 దేహభంగిమలు**

**నిలుచుట:** క్రైస్తవ ఆరాధన యొక్క సామాన్య స్వభావము నిలుచుటయే. నిలువబడటం పునరుత్థానమునకు గుర్తు.

**కూర్చుండుట:** శ్రద్ధతో ఆలకించుటను ఇది సూచిస్తుంది.

**మోకరించుట:** అప్పుల మన్నింపు కోసం యాచన చేసే వారి, పశ్చాత్తాప పడే పాపులైన వారి దేహభంగిమయిది.

**శిరము వంచుట:** విధేయత, గౌరవం, ఆరాధన, కృతజ్ఞత మొదలైన భావాలన్ని శిరము వంచుట ద్వారా వెల్లడించబడుయి.

**చేతులు చాచి ఉండుట:** ఈ విధంగా ఉండటం ఇతరుల కోసం మధ్యస్థ ప్రార్థన చేయుటను, విన్నపించుటను సూచిస్తుంది.

**సమాధాన సాంగ్యము:** ఈ సాంగ్యము ఒకరికొకరిపై ఉన్న ప్రేమ, ఐక్యతలను ప్రకటిస్తుంది. ఇది సఖ్యపడుటను కూడా సూచిస్తుంది. విశ్వాసులందరు క్రీస్తునందు ఒకే శరీరమగునని ఈ సాంగ్యము నిరూపిస్తుంది.

**చుంబనం:** బలిపీఠము, పవిత్ర గ్రంథం, సిలువ మొదలైన వాటిని ముద్దాడటము ద్వారా వాటి మీద ఉన్న ప్రేమాభిమానములు ప్రకటిస్తున్నాము.


**సిలువ గుర్తు వేయడం:** దివ్యపూజాబలిలో పలుమార్లు సిలువ గుర్తు వేసుకోవడము గాని సిలువ గుర్తుతో ఆశీర్వాదము ఇవ్వడము జరుగుతుంది. సిలువ అనేది మానవజాతి రక్షణకు సంకేతము. పైగా సిలువ స్వయంగా యేసు ప్రభునే సూచిస్తుంది.

**ధూపము అర్పించుట:** పాపక్షమాపణ, సఖ్యత, గౌరవం, ప్రాయశ్చిత్తము, పవిత్రీకరణ మున్నగు వాటికి ప్రతీక ధూపార్పణము. ధూపం పైకి వెళ్ళడం ప్రార్థనలు పరలోకం వైపు వెళ్ళడానికి ప్రతీక.

**హస్త క్షాళన:** అప్ప, ద్రాక్షా రసములు అర్పించే ముందు గురువు చేతులు కడుగుకొని తుడుచుకోవటం పాపములనుండి ఆత్మను ప్రక్షాళనం చేయుటను సూచిస్తుంది.

**భక్తి ప్రదక్షిణలు:** యేసు ప్రభు మనుష్యావతారము, బహిరంగ జీవితము, జెరుసలేం పురప్రవేశము, కల్వరి సిలువ మార్గ ప్రయాణము మొదలైన సంఘటనలను సూచిస్తున్నాయి.

**దీప ప్రజ్వలన:** లోకానికి వెలుగు యేసు ప్రభువు అనే నిజాన్ని గుర్తు చేసుకొంటూ దివ్యపూజాబలి మరియు ఇతర దైవార్చనల మధ్య దీప ప్రజ్వలన గావిస్తాము.



## పునీత మత్తయి సువిశేష వివరణ
## గ్రంథ పరిచయం

**1. రచయిత**

ఈ సువిశేషం మత్తయి పేరు మీదుగా పిలువబడుతుంది. కాని ఈ మత్తయి క్రీస్తు శిష్యుడూ అపోస్తలుడు అయిన మత్తయి కాదు. ప్రస్తుత గ్రంథకర్త పై మత్తయి శిష్యగణంలోనివాడయి ఉండవచ్చు. ఇతడు రెండవతరం క్రైస్తవుడు. గ్రీకు, అరమాయిక్ భాషలు బాగా తెలిసినవాడు. పూర్వ, నూత్న వేదాలు రెండూ క్షుణంగా అర్థం చేసుకొన్నవాడు. వేదాంతవేత్త. బహుశ: ఆనాటి క్రైస్తవ సమాజంలో అధికారి కూడ. (మత్తయి 13,52) ఇతనికి బాగా వర్తిస్తుంది. ఇతడు యూదుల పూర్వవేదాన్ని క్రైస్తవుల నూత్నవేదంతో సమన్వయపరచగోరాడు.


**2. దేశకాలాలు**

ఈ గ్రంథం సిరియాలోని అంటియోకియ నగరంలో పుట్టింది. ఇక్కడ క్రైస్తవులు ప్రధానంగా గ్రీకు మాట్లాడే యూదులు. ఇంకా, క్రైస్తవ మతాన్ని స్వీకరించిన గ్రీకు ప్రజలు కూడ ఇక్కడ ఉండేవారు. ఆ రోజుల్లో వీరి సంఖ్య నానాటికీ పెరుగుతూ ఉండేది. ఈ పుస్తకం క్రీస్తుశకం 80-90 మధ్యకాలంలో, బహుశ: 85 ప్రాంతంలో వ్రాయబడి ఉండొచ్చు.

**3. శైలి**

రచయిత ఈ గ్రంథాన్ని నేరుగా గ్రీకు భాషలోనే వ్రాసాడు. ఇతని గ్రీకు శైలి నిర్దుష్టమైంది. ఈ గ్రంథంలో ఐదు ప్రధాన భాగాలు, రెండు ఉపభాగాలు ఉన్నాయి. రచయిత వీటినన్నిటినీ ఓ స్పష్టమైన క్రమపద్ధతిలో అమర్చాడు. "అప్పుడు" "అదిగో" అనేవి ఈ రచయిత పలుసార్లు వాడిన ఊతపదాలు - 3,13; 2,9. ఈ గ్రంథం యూదుల ఆచార వ్యవహారాలతోను సంప్రదాయాలతోను నిండి ఉంటుంది. యూదుల పారిభాషిక పదాలు కూడా చాలా వస్తాయి. ఆనాటి అతని పాఠకులు ప్రధానంగా యూదులే. నాలుగు సువిశేషాల్లోను ఇది యూద సంస్కృతిని ఎక్కువగా ప్రతిబింబించే గ్రంథం.

సశేషం....




## హిప్పోనగర పునీత అగస్టీను

**(బిషప్, శ్రీసభ పండితుడు, ముద్రాపకుల పాలక పునీతుడు క్రీ॥శ॥ 354-430)**

అగస్టీను వారికి పునీత పట్టా కట్టబెడుతూ 1వ లియో జగద్గురువులు "పునీత అగస్టీను వారి పండుగను ప్రత్యేక గౌరవంతో ఒక అపోస్తలునికి ఇవ్వాల్సిన ప్రాముఖ్యతతో జరుపుకోవాలి. తరతరాల వరకు కతోలికులకు, అన్యులకు అందరికి సమానంగా వీరి రచనలు మంచి ప్రేరణ, స్ఫూర్తి అందిస్తాయి" అని అన్నారు.

అగస్టీను వారు ఉత్తర ఆఫ్రికాలోగల హిప్పోనగర పీఠం, నుమిదియా మండలంలోని 'తగాస్టె' అనబడే చిన్న పట్టణంలో క్రీ॥శ॥ 354 నవంబరు 13న తొలి సంతానంగా జన్మించారు. తల్లిదండ్రులు అంత ధనవంతులు కారు. కాని ఉన్నత కుటుంబమే. తండ్రి పేరు పెట్రిషియస్. అన్యుడు, కోపిష్ఠి. కాని ఉత్తమ క్రైస్తవ ఇల్లాలి వల్ల తన మరణానికి చాలా ముందే దీనత్వము అపాదించుకొని జ్ఞానస్నానం పొందాడు. ఈయన భార్య అనగా అగస్టీను గారి తల్లి పేరు మోనికా. ఈమె భర్తకు ఉత్తమ ఇల్లాలేగాక తమ పిల్లలకు ఆదర్శతల్లి. ఈమె పునీతురాలు కూడా. వీరికి అగస్టీను, నవిజియస్ అనే కొడుకులు పెర్పుతువా అనే కూతురు కలిగారు. అగస్టీను గారు తన బాల్యం, నిలకడ నీతిలేని యవ్వనం, స్వీయ పరివర్తన, తల్లి మరణోదంతం గూర్చి "పాపోచ్చరణలు" అనే ఆత్మ కథలో వ్రాసుకున్నారు. "పరుల బ్రతుకులు, ప్రవర్తన గూర్చి ఆసక్తి కనబరిచే మనిషి తనను తాను సంస్కరించుకోవడానికి ఎందుకు జాగ్రత్తపడడు? ఒక పాపాత్ముని యెడల దైవం చూపే కనికరం గుర్తించాలి. తాను ఉన్న స్థితి కంటే గొప్పవాడని ఎవరూ తలంచరని గ్రహించాలి" అని ఈ అనుభవజ్ఞుడు వ్రాశారు.

అగస్టీను తన 12 ఏళ్ల ప్రాయంలో 'మదౌరా' పట్నంలోని ఒక రోమను వ్యాకరణ పాఠశాలలో చేర్పింపబడ్డాడు. లాటిను భాష బాగా నేర్చుకున్నాడు. కాని గ్రీకు భాష నేర్వడంలో వెనుకబడ్డాడు. తన 16వ ఏట తగాస్టెకు తిరిగి వచ్చాడు. ఇక అగస్టీను గారికి చెడ్డ స్నేహితులు దాపురించారు. దుర్వ్యసనాలతో విచ్చలవిడిగా తిరగడం ఎక్కువైంది. వీరిని సంస్కరించాలని తండ్రి ఆకాంక్ష. కాని అంత తీరిక పట్టింపు చూపలేదు. వైరము, మోహము, క్రోధము అనే మనో వికారాలను అణచి వేసుకొమ్మని తల్లి బుద్ధిమాటలు పలికింది. పదే పదే ప్రభువును ప్రార్థించింది.

ఇంతలో తండ్రి గతించగా ఒక ధనవంతుని ఆర్థిక సహాయంతో 'కర్తాన్యే' నగరంలో పెద్ద చదువులకై వెళ్లాడు. ఇక్కడ మానసికంగా బాగా ఎదిగాడు. సాహిత్య విద్యలో మొదటి వానిగా నిల్చాడు. కాని ధన సంపాదన, కీర్తి, అహంకారం పెంచుకునేందుకే చదువని, అప్పట్లో తుచ్ఛంగా భావించానని అగస్టీను తమ ఆత్మకథలో వ్రాసుకున్నారు. తన ఈ విద్యాకాలంలోనే ఒక స్త్రీతో సంబంధం పెట్టుకొని 13 సం॥లు కాపురం చేశారు. తనకు 20 ఏళ్లు నిండకముందే తండ్రి అయ్యాడు. కాని అగస్టీను ఒక అన్యుడుగానే జీవించడం తల్లి మోనికాకు నచ్చలేదు. మనో పరివర్తన చెంది మంచి క్రైస్తవునిగా మారాలని దేవుని సాయంకోరుతూ పరిపరి విధాల ప్రార్థనలు చేసేది.

అగస్టీను గారు సుప్రసిద్ధ గ్రంథకర్తలైన వెర్జిల్, వర్రో, సిసిరో రచనల్ని చదివి సంతృప్తి పడక వేద శాస్త్రాలు చదవడం మొదలుపెట్టారు. ఆ తర్వాత తగాస్టె, కార్త్యేజ్ పట్టణాల్లో 9 సం॥లు సాహిత్యం, వ్యాకరణ శాస్త్రాల విద్యాలయాన్ని నడిపారు. మోనికాగారు తమ దాపులోని బిషప్పు గారికి తన గోడు వెళ్లబోసుకుంది. "అమ్మా! నీ పుత్రుని పరివర్తన కోసం నీవు రాల్చిన కన్నీటి చుక్కలు వృధాపోవు. నీ ప్రార్థలు, ఉపవాసాలు, సుబోధలు అగస్టీనును ఏనాటికైన ఉత్తమ క్రైస్తవుని చేస్తాయి" అని చెప్పారు. ఒకరోజు ఆఫ్రికా నుండి పొంతితియాన్, అలిపియన్ అను ఇద్దరు క్రైస్తవులు వచ్చి అగస్టీను గారిని కలుసుకున్నారు. ఈజిప్టు దేశ పునీత అంతోని వారి ఆదర్శ చరిత్రను విన్పింపజేశారు. పునీత పౌలు రోమీయులకు వ్రాసిన లేఖ 13,13-14 చదివిన అగస్టీను గారిలో పరివర్తన కలిగింది. మిలాన్ నగరంలోనే పునీత బిషప్ అంబ్రోస్ గారి ద్వారా క్రీ॥శ॥ 387 ఏప్రిల్ 24న జ్ఞానస్నానం పొందారు. క్రొత్త జీవితం మొదలుపెట్టారు. పిమ్మట స్వదేశం వెళ్లడానికి తల్లితో సహా ఓస్టియా ఓడరేవు వెళ్లారు. అస్వస్థత వల్ల తల్లి మోనికా అక్కడే మృతి చెందారు. ఈ సందర్భంగా "నా తల్లికి ఆమె ప్రార్థనలకు ఉన్నతాశయాలకు నేను సర్వదా ఋణపడి ఉంటాను" అని అగస్టీను గారు వ్రాసుకున్నారు.

అటు పిమ్మట అగస్టీను గారు స్వగ్రామం తగాస్టెకు వచ్చారు. దురదృష్టవశాత్తు తాను ప్రేమించే కుమారుడు తన 17వ ఏట చనిపోవడం జరిగింది. తనలో విపరీతమైన వైరాగ్యం జనించింది. కఠోర బ్రహ్మచర్యం పాటించారు. క్రీస్తు కోసం తానొక ఆశ్రమం స్థాపించారు. దారిద్ర్యం, ప్రార్థన, గ్రంథ పఠనం వంటి వ్రతదీక్షతో ఆశ్రమ మఠం అభివృద్ధి చెందింది. తాను గురువు కావాలని అనుకోలేదు. కాని గురువిద్యను మూడేళ్లు అధ్యయనం చేసి క్రీ॥శ॥ 391లో హిప్పోనగర పీఠాధిపతి వలేరియున్ గారిచే గురుపట్టాభిషక్తులయ్యారు. ఉత్సాహంతో సువార్త ప్రచారం చేశారు. ఉత్తరించు ఆత్మల విమోచనకై ప్రార్థన, సిలువ స్వరూప వందన ప్రోత్సహించారు. తన 42వ ఏట క్రీ॥శ॥ 395లో బిషప్ వలేరియస్ గారికి సహాయక పీఠాధిపతిగా అభిషేకితులై వారి మరణానంతరం హిప్పోనగర పీఠాధిపతి అయ్యారు. గురువులు, డీకనులు, ఉపడీకనుల సంఖ్యను పెంపొందింపజేసి క్రైస్తవం వర్థిల్లజేశారు. క్రీస్తు అపోస్తలునిగా సామాన్య జీవితంకు మఠవాసులు కట్టుబడునట్లు చేశారు. మఠ ఆశ్రమాలు, వైద్యశాలలు, గుడులు నెలకొల్పారు. స్త్రీలకు ఒక సభను ఏర్పరచి తన చెల్లి పర్పెతువా గారిని మఠశ్రేష్ఠురాలమ్మగా నియమించారు.

అగస్టీను గారు తమ క్రైస్తవులతో "మీరు లేకుండా నేనొక్కన్నే రక్షింపబడటం నాకు ఇష్టం లేదు" అనే వారు. మరియు "నేనెందుకు ఈ లోకంలో ఉన్నాను? క్రీస్తులో జీవించడానికి. అదీనూ మీతో కలిసి జీవిండానికి, ఇదే నా సంపద గౌరవం ఆనందం" అనేవారు. వీరికి పునీత జెరోమ్ గారితో పరియముండేది. ఆనాటి బలమైన 'మేనిబియం' మత నాయుకుడైన ఫెలిక్స్‌ను బహిరంగ చర్చలో ఓడించగా అతడు జ్ఞానస్నానం పొందినట్లు చరిత్ర చెపుతోంది. విగ్రహారాధకులలో పరివర్తన కలిగేలా బోధించారు. వారి కొరకై "దేవుని పట్టణం" అనే గ్రంథం రచించారు. కతోలికుల వేదంకు వ్యతిరేకులైన "డొనాటిస్టులు, పెలాజినియస్టుల" కు తగు బుద్ధిచెప్పుటకు "పునీతుల యొక్క ముందస్తు గమ్యస్థానం", "పట్టుదలా వరం" అనే గ్రంథాల్ని వ్రాశారు. గురువులు క్రీస్తు అడుగుజాడల్లో నడుస్తూ ఆదర్శ జీవితంతో మంచి కాపరులై తమ క్రైస్తవ మందను పరిరక్షించుకోవాలన్నారు. వీరు క్రీ॥శ॥ 430 ఆగస్టు 28న తమ 76వ ఏట పరమపదించారు. వేదాంత పండితులు, ముద్రాపకులు పునీత అగస్టీనుగారిని తమ పాలక పునీతులుగా కొనియాడతారు. అగస్తీను అనగా పూజ్యుడైన, అభిషేకితుడైన అని అర్థం.

**ధ్యానాంశం:**

**"వెలుతురులో జీవించు ప్రజలుగ, సత్ప్రవర్తన కలిగి యుందము. వినోదముతో కూడిన విందులు కాని, త్రాగుబోతు తనముకాని, భోగలాలసత్వము కాని, అసభ్య వర్తనకాని, పోట్లాట కాని, అసూయ కాని ఉండరాదు. కాని, ప్రభువైన యేసు క్రీస్తును ధరించి, మీ శరీరేచ్ఛలను తృప్తిపరచుటలో మీరు చూపు శ్రద్ధను మానివేయుడు"**
**(రోమీ 13,13-14)**

# శుభవచనం బైబిల్ క్విజ్

**సామెతల గ్రంథము 16-31 అధ్యాయాలు**

పేరు ............................ఇంటి పేరు.......................విచారణ ..............................

**I. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి** ఫోన్ నెంబర్..................................

1) దేవుని నీ కార్యక్రమములను ................................ వేడుకొందువేని నీకు తప్పక విజయము కల్గును.

2) ప్రభువు ................................... కోట వంటిది.

3) తండ్రిని ..........................., ..................... ఇంటి నుండి గెంటి వేయువాడు .........................., అపకీర్తి తెచ్చుకొనువాడు కూడ.

4) ..................... చూచి .......................... చెందకుము. ఎల్లవేళల నీవు.................మెలగుము.

5) కాని హృదయజ్ఞానియైన దేవుడు నీ .................. కనిపెట్టకపోదు. ఆయన నిన్ను.................చూచును.

6) కాని ప్రభువు మన ............................ పరిశీలించి చూచును.

7) ఎవడు త్రవ్విన ................ వాడే పడును. ఎవడు ............................వాని మీదికే దొర్లును.

8) కోపము ............................ వినాశప్రదమైనవి. కాని .................. వాని కంటెను ......................

9) నీ కుమారుని చక్కదిద్దినచో నీకతడి వలన ................................. కలుగును.

10) యోగ్యురాలైన ..................... ఎచట దొరుకును? ఆమె ...................... కంటె విలువైనది.

11) వెండి ....................... కుంపటి పరీక్షించును. నరుని హృదయమును .................. పరీక్షించును.

12) తల్లి దండ్రులను శపించువాని దీపం ఏమయిపోవును?

13) దయను, సత్యంను పాటించు వానికి ఏమి లభించును?

14) ప్రభువు .............................తీసుకొనును. వారిని పీడించువారిని తాను .............................

15) నోటినదుపులో పెట్టుకొనువాడు ....................................................... తప్పించుకొనును.

16) తన్ను తానదుపులో పెట్టుకోలేని వాడు ఎటు వంటివాడు?

17) దేవుని పట్ల భయభక్తులు కలవాడు ఏమి బడయును?

18) దేవుని వాక్కులలో ఏమి ఉండదు?

19) అన్యాయముగా సంపాదించిన సొమ్ము ఎలా ఉండును?

20) మూర్ఖుని పొగడుట ఎటువంటిది?

21) అపకారికి ఏమి తలపెట్టవలదు?

22) .................................. సూక్తులను సావధానముగా వినుము. వారి ......................................
జాగ్రత్తగా గ్రహింపుము.

23) నీ శత్రువు పడిపోయినపుడు నీవు ఏమి చేయవలదు?

24) మహాసంపదల కంటే గూడ ఏమి మిన్న?


25) ప్రభువు ఆశ్రయముగా కాపాడును. ........................................భంగపరచి...............................
ఆశ్రయముగా కాపాడును.

**శుభవచనం బైబిల్ క్విజ్ జవాబు పత్రాన్ని విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలో గానీ ఫిబ్రవరి నెల 5వ తేదీలోపు మాకు పంపించాలి.**

**వచ్చే నెల పాఠ్యాంశం: ఉపదేశకుడు గ్రంథం 1-12 అధ్యాయాలు**

# ఇంద్రధనుస్సు

"ఇంకను పరలోక రాజ్యము సముద్రములో వేయబడి, అన్న విధములైన చేపలను పట్టిన వలను పోలియున్నది. వలనిండినపుడు దానిని ఒడ్డునకు లాగి అచట కూర్చుండి మంచి చేపలను బుట్టలలో వేసి, పనికిరాని వానిని పారవేయుదురు" అని దైవరాజ్యము గురించి యేసుప్రభు చెప్పిన "మంచి చేపలు–చెడు చేపలు" (మత్తయి 13,47–50) ఉపమానమును తెలిపే ఈ చిత్రాన్ని రంగులమయం చేద్దాం.



**పేరు:..............................వయస్సు.......తరగతి.......స్థలం................**

**సూచన :**

1. కేవలం 15 సం॥ల లోపు పిల్లలే ఈ పోటీలో పాల్గొనాలి.
2. రంగులు నింపిన చిత్రాన్ని మీ విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలోగానీ ఈ నెల 30వ తేదీలోపు మాకు పంపించాలి.



# "పిల్లలూ! యేసయ్య మిమ్ములను పిలుస్తున్నాడు"

**"యూదుల రాజుగా జన్మించిన శిశువెక్కడ? ఆయన నక్షత్రమును తూర్పు దిక్కున చూచి మేము ఆరాధింప వచ్చితిమి" మత్తయి 2,2**

**ప్రియమైన చిన్ని బిడ్డలారా!**

క్రిస్మస్ పండుగకు మనం అందరము ఇంటిపైన ఒక నక్షత్రాన్ని పెట్టాం. ఆకాశంలోని అందాల తారలు అన్నిటంకంటె ఒక ప్రత్యేకమైన తార, యేసయ్య జననాన్ని ఈ లోకంలో ప్రకటించింది. అందుకే తూర్పు దిక్కు రాజులు యేసయ్యను అన్వేషించి ఆయనను ఆరాధించటానికి బయలు దేరారు. అన్వేషణకు, ఆరాధనకు దారి చూపిన నక్షత్రం.

ఈ నక్షత్రం గురించి సంఖ్యాకాండం 24,17 ఇలా చెబుతుంది. "ఇస్రాయేలు నుండి ఒక నక్షత్రము ఉదయించును. ఒక రాజదండము బయల్వెడలును". ఇంత శక్తి గల నక్షత్రము యేసయ్య దగ్గరికి అందరిని సాదరంగా ఆహ్వానిస్తుంది.

అందరిని ఆనందంలో అలరించిన ఆ నక్షత్రంలాగా నూతన సంవత్సరంలో మీ ఇంటి నక్షత్రం నీవు కావాలి. 2021లో నక్షత్రంలా నీవు ఒక మెరుపు మెరవాలి. నీతో ఆడిపాడి, చదువుకునే బాలలందరిని యేసయ్య వైపు ఆకర్షించే నక్షత్రంగా నీవు కావాలి. ఎలా? ఆలోచించు ఎలా? క్రిస్మస్ పండుగ ద్వారా యేసయ్య ఈ లోకానికి ఏం తెచ్చాడు. దేవుడు మనతో ఉన్నాడు అన్న భరోసా, శాంతి, దైవ ప్రేమ, మంచి మనస్సు. నీ మంచి మనస్సు అందరికి శాంతిని పంచాలి, ప్రేమను పంచాలి. చిరునవ్వులు చిందించే చిన్నారి యేసుకు చిన్నారి నక్షత్రంగా నీవు మారాలి.

నూతన సంవత్సర అందాల తారగా వెలగాలని, మెరుపు తారలా ఎదగాలని, దివ్యజ్యోతిగా బాలయేసు వెలుగును లోకానికి చాటాలని కోరుతూ దీవిస్తూ......**మీకందరికి....**

**నూతన సంవత్సర శుభాకాంక్షలు.......**

"that they may have life in abundance" (John 10:10)


# DIOCESE OF ADILABAD

Bishop's House, Mancherial P.O. - 504 208, Adilabad Dist., Telangana State, India
Phone: +91- 08736-258262, Cell: +91- 9490560503
Email ID: bishopadilabaddiocesein@gmail.com, princeap13@gmail.com





***Bishop Prince Antony Panengadan***
*Bishop of Adilabad*


## ధ్యాన కేంద్రం నిర్మాణం కొరకు చేయి చేయి కలుపుదాం

క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా! మీకందరికి క్రీస్తు నామమున శుభాకాంక్షలు.

అసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన ప్రాంతంలో "ఎఫ్ఫాతా ధ్యాన కేంద్రం" నిర్మాణం జరుగుతున్న విషయం మీకందరికి తెలుసు. విశ్వాసులు మరియు నూతనంగా క్రీస్తును గురించి తెలుసుకున్న వారు లోతుగా విశ్వాసంలో ఎదుగుటకు, సువార్తను బోధించుటకు, విశ్వాస సంబంధమైన విషయాలను తెలియజేయుటకు, ప్రార్థనలో, ఆత్మీయతలో ఎదిగే విధంగా నడిపించుటకు మన మేత్రాసనంలో "ధ్యాన కేంద్రం" అత్యవసరమని మనందరికి తెలుసు. ఇదే మన సువార్త పరిచర్య ప్రయాణంలో మరొక అడుగు.

02 ఏప్రిల్ 2018 నాడు శంకుస్థాపన చేయబడి 28 మార్చి 2019 నాడు ఆరంభించబడిన ధ్యాన కేంద్ర నిర్మాణ పనులు 70శాతం ముగిసింది. ఎంతోమంది ఉపకారులు ధ్యాన కేంద్ర నిర్మాణం కొరకు ఆర్థిక సహాయాన్ని అందించారు. మేత్రాసనానికి క్రమంగా ఆర్థిక సహాయం చేసే ఉపకారులు కూడా కోవిడ్-19 మహమ్మారి కారణంగా ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నందున రానున్న కాలంలో వారు మనకు సహాయం చేసే స్థితిలో లేరు. వారిని మరల సహాయం కొరకు సమీపించే పరిస్థితి లేదు. ఈ స్థితిలో ధ్యాన కేంద్ర నిర్మాణం కొరకు మిమ్ములను సమీపిస్తున్నాను. ఇది మన ధ్యాన కేంద్రం కాబట్టి అందరి సహకారము లేనిదే ఈ నిర్మాణమును పూర్తి చేయటం కుదరదని మనకు తెలుసు. ఈ ధ్యాన కేంద్రం అనేక మందికి ఆశీర్వాదకరంగా మారుతుందనడంలో ఎటువంటి సందేహము లేదు. ఈ ధ్యాన కేంద్రం నిర్మాణం కొరకు మీ వంతు ఉదారమైన సాయం చేయగలరని కోరుతున్నాను. మనం చిన్న చిన్న త్యాగాలు చేసి ధ్యాన కేంద్రం నిర్మాణానికి తోడ్పడుదాం. మీరందరు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలుసు. అయినప్పటికీ కొంచెం త్యాగం చేసినట్లయితే, మనకు వీలైనంతలో సహాయాన్ని అందించవచ్చు. ఈ నిరీక్షణతో మీ ముందు కొన్ని ప్రతిపాదనలను ఉంచుతున్నాను.

1. ప్రతి విచారణ మరియు మిషన్ కేంద్రం ఒక ఆదివారం కలెక్షన్‌ను ధ్యాన కేంద్ర నిర్మాణం కొరకు ఇవ్వవచ్చు.
2. ప్రతి ఉద్యోగి ఒక నెల జీతపు దశమ భాగాన్ని ధ్యాన కేంద్ర నిర్మాణం కొరకు ఇవ్వవచ్చు.
3. ధ్యాన కేంద్రపు ఒక చదరపు అడుగు నిర్మాణముకు అయ్యే ఖర్చు రూ။1200. మన మేత్రాసనంలోని ప్రతి కుటుంబం ఒక చదరపు అడుగు నిర్మాణముకు అయ్యే ఖర్చును ఇచ్చి ధ్యాన కేంద్రం నిర్మాణంలో పాలుపంచుకోవచ్చు. ఒక చదరపు అడుగు అంటే ఒక వ్యక్తి నిల్చునే స్థలం. ఒక చదరపు అడుగు నిర్మాణముకు అయ్యే ఖర్చును ఇవ్వడమంటే ఒక వ్యక్తికి దేవుని సువార్తను వినే అవకాశాన్ని ఇవ్వడంతో సమానం.
4. ధ్యాన కేంద్రం నిర్మాణం పూర్తి అయ్యేలోపు మన మేత్రాసనంలోని ప్రతి విశ్వాసి ధ్యాన కేంద్ర ప్రాంగణంలో జరిగే శ్రమదానంలో ఒక్క రోజైన పాల్గోనవచ్చు.

"that they may have life in abundance" (John 10:10)

**DIOCESE OF ADILABAD**

Bishop's House, Mancherial P.O. - 504 208, Adilabad Dist., Telangana State, India
Phone: +91- 08736-258262, Cell: +91- 9490560503
Email ID: bishopadilabaddiocesein@gmail.com, princeap13@gmail.com



*Bishop Prince Antony Panengadan*
*Bishop of Adilabad*

**మీ విరాళాలు పంపించే అకౌంట్ నెంబర్**

DIOCESE OF ADILABAD SOCIETY
A/C No. 0867053000000001
IFSC Code : SIBL0000867
BANK : SOUTH INDIA BANK
BRANCH : MANCHERIAL, TELANGANA

Gpay, Paytm **ఉపయోగించే వారి కొరకు**

**మీరు ధ్యాన కేంద్రం కొరకు మీ వంతు సాయం చేయాలనుకుంటే మాకు ఫోన్ ద్వారా కానీ, ఈమెయిల్ ద్వారా గానీ లేక రాతపూర్వకంగా తెలియజేయగలరు.**

PH. NO. 94938 58133
EMAIL ID: bishopadilabaddiocesein@gmail.com

**మా చిరునామా**

BISHOP PRINCE ANTONY
BISHOP'S HOUSE
MANCHERIAL P.O
MANCHERIAL DISTRICT-504 208
TELANGANA

**మీరు ఈ పవిత్ర కార్యానికి తోడ్పడతారని ఆశిస్తూ మీకందరికి ముందస్తుగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను.**

**క్రీస్తునందు మీ తండ్రి**

+ Pamp

**బిషప్ ప్రిన్స్ అంతోని**

**ఆదిలాబాద్ గురుపీఠ మేత్రానులు**

# బైబిల్ దృశ్యమాలిక


యోసేపు బట్టలను గొర్రె రక్తంతో తడిపి తండ్రికి చూపించారు
నాన్నా! ఇది మాకు దారిలో కనిపించింది.
ఇది మీరు యోసేపుకు బహుమతిగా ఇచ్చింది కదూ!
?
నాయనా! యోసేపు నిన్ను ఏ మృగమో చంపివేసిందా?
నీవు లేకుండా ఎలా బ్రతకాలిరా నాయనా!

## నోవెల్ కరోనా వైరస్ (కోవిడ్–19) నుండి విడుదల కొరకు ప్రార్థన

మహాకృపాసంపన్నుడైన పరమతండ్రి, మీరు ఈ లోకమంతటిపై, మానవులందరిపై మీ ప్రేమను కుమ్మరిస్తున్నారు. అందరిపై ప్రత్యేకముగా అనారోగ్యముతో బాధపడుతున్న వారిపై మీ అనుగ్రహములను కురిపిస్తున్నారు. ఓ ప్రభువా, కొరోనా వైరస్ సోకిన వారిని మీకు సమర్పించి ప్రార్థిస్తున్నాము. "అతడు పొందిన దెబ్బల ద్వారా మనకు ఆరోగ్యము చేకూరెను" అన్న వాక్యమును ఆధారముగా చేసికొని మీ సన్నిధిలో మొరపెడుతున్నాము. మా కన్నీటి మొరను ఆలకించండి. కొరోనా వైరస్ సోకిన వారిపై మీ దయగల హస్తమును చాపండి. వారిని స్వస్థపరచండి. ఈ వైరస్ సోకిన వారిని, దానికి బలైపోతున్న వారి కుటుంబాలను ఓదార్చండి. రోగులకు చికిత్సనందిస్తున్న వైద్యులను, వారికి సహాయం చేస్తున్న వారిని, ప్రభుత్వ యంత్రాంగమును దీవించండి. ఈ వైరస్‌కు మందును కనుగొనుటకు చేసే పరిశోధనలను, అన్ని ప్రయత్నాలను ఫలవంతం చేయండి. ప్రపంచమంతటిపై మీ స్వస్థత వరమును జడివానలా కురిపించండి. ఈ వైరస్ మాకు సోకకుండా ఉండుటకు మీ సంరక్షణను మాకు దయచేయండి. ఈ ప్రార్థనను పరమవైద్యుడైన యేసు క్రీస్తు నామమున వేడుకుంటున్నాము. ఆమెన్.

**1 పరలోక జపం, 1 మంగళవార్త జపం, 1 త్రిత్వ స్తోత్రం**

## శుభవచనం బైబిల్ క్విజ్‌లో పాల్గొనే వారందరికి శుభవార్త

2020 బైబిల్ క్విజ్ సిరీస్ రద్దు చేయడం జరిగింది. 2021 జనవరి నెల నుండి క్రొత్త సిరీస్‌ను ప్రారంభిస్తున్నాము.

1. ప్రతి నెల అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి నెల చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి.
2. ప్రతి నెల క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేరు మరియు మార్కులు వ్రాసి ఉంచుతాము. ఇలా అన్ని నెలలు క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి సంవత్సరం చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి. మొదటి బహుమతి రూ॥ 10,000/–లు, రెండవ బహుమతి రూ॥ 8,000/–లు, మూడవ బహుమతి రూ. 6,000/– సంవత్సరములోని అన్ని పరీక్షలలో పాల్గొన్నవారికి ప్రోత్సహక బహుమతులు ఇవ్వబడుతాయి.

**మీరు ఈ గొప్ప అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాము.**

# శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు

**సామెతల గ్రంథము 1-15 అధ్యాయాలు**

1) విజ్ఞాన (2,2)

2) దేవుని పట్ల భయభక్తులు చూపుట (9,10)

3) హృదికి (15,30)

4) అవివేకి (11,12)

5) దేవుని, తెలివి తేటల మీద (3,5)

6) విజ్ఞానమును ఆర్జించుట (4,7)

7) నరుల (5,21)

8) దీర్ఘాయుష్మంతుడగును (10,27)

9) అబద్ధములాడు నరుని (12,22)

10) పొరుగు వానిని (14,21)

11) విజ్ఞానమును, తెలివి (7,4)

12) అనాదరము (1,8)

13) ఫలితముండును (12,14)

14) ఆయురారోగ్యములు (14,30)

15) సురక్షితముగా (1,33)

16) జ్ఞానమును (10,14)

17) ప్రేమించు వారిని (8,21)

18) సత్యవాక్కులే (8,6)

19) పొగరు బోతు (13,10)

20) నిర్లక్ష్యము (12,8)

21) వినయవంతులకు (3,34)

22) శ్రద్ధగా (4,20)

23) కోపశీలుడు (15,18)

24) విజ్ఞానము (3,18)

25) వినయవంతునకు (11,2)

**వచ్చే నెల పాఠ్యాంశం: ఉపదేశకుడు గ్రంథం 1-12 అధ్యాయాలు**

# శుభాకాంక్షలు అందించండి



**జన్మదినం, వివాహము, వివాహ వార్షికోత్సవ, విచారణ పండుగలను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేయాలనుకునేవారికి ఇదొక సదావకాశం. మీరు మీ ఫోటోను, ప్రచురించవలసిన వార్తను పంపించినట్లయితే మేము మీ తరుపున ఈ మాసపత్రికలో శుభాకాంక్షలు ప్రచురిస్తాము.**

బ్లాక్ & వైట్ ఫుల్ పేజీ రూ. 1000/-

బ్లాక్ & వైట్ ఆఫ్ పేజీ రూ. 500/-

బ్లాక్ & వైట్ క్వాటర్ పేజీ రూ. 250/-

ఈ సదావకాశమును వినియోగించుకొని మీ కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేయండి.

**వివరాలకు సంప్రదించండి**

9440874028

**రచయితలారా, గమనించండి ! వెంటనే రచనలు పంపండి!**

ఆధ్యాత్మిక స్ఫూర్తినిచ్చే రచనలు, కథానికలు, కవితలు, పిల్లల కథలు, మన విశ్వాసం గురించిన వివిధ అంశాలపై సామాజిక స్ఫూర్తినిచ్చే రచనలు వెంటనే పంపండి. **మీ రచనలు ప్రతినెల 12వ తేదిలోగా చేరాలి.** అలస్యంగా వచ్చే రచనలు పరిశీలింపబడవు.

**వివరాలకు సంప్రదించండి**

9398764408

**ఈ పత్రికను పొందాలనుకునే వారు మీ వివరాలు, అడ్రస్ మాకు పంపించండి**

**వార్షిక చందా 120 రూ॥లు**

**మా అడ్రస్**

**జీవస్వరం**

బిషప్స్ హౌస్, మంచిర్యాల - 504 208

మంచిర్యాల జిల్లా, తెలంగాణ

Cell : 9398764408, e-mail : jeevaswaramadilabad@gmail.com